RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




| హైదరాబాద్ | మంగళవారం 23-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 267 పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి |
|---|---|---|---|---|---|



# మెట్రోపై సానుకూలం

- రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భేటీ
- మెట్రో ఫేజ్--2ను సంయుక్త వెంచర్‌గా చేపట్టాలని రేవంత్ వినతి
- మెట్రో తొలి దశకు ఐఆర్‌ఎఫ్‌సీ రుణం మంజూరు చేయాలని విజ్ఞప్తి
- సంయుక్త కమిటీ నియమిస్తే విస్తరణ వేగవంతమవుతుందన్న కేంద్ర మంత్రులు
- నేడు కేంద్ర గృహనిర్మాణ శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం

న్యూఢిల్లీ,:దేశ రాజధాని పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా వీరితోపాటు చర్చలో పాల్గొన్నారు. ఢిల్లీలోని రైల్వేభవన్ వీరి సమావేశానికి వేదికైంది. వీరి మధ్య దాదాపు రెండు గంటలపాటు చర్చలు సాగాయి. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) రుణంతోపాటు మెట్రో ఫేజ్--2 విస్తరణకు త్వరితగతిన అనుమతుల విషయమై వారి మధ్య ప్రధానంగా చర్చ జరిగింది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు ఫేజ్--1కు కేంద్రం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద ఇప్పటివరకు రూ.1,204 కోట్లు ఇచ్చిందని ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ చెప్పినట్లు తెలిసింది. ఫేజ్--2 విషయంలో తర్జనభర్జనలు గుతున్న సమయంలోనూ కేంద్రం సూచించిన రెండు ప్రత్యామ్నాయాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. దీనిలో ప్రధానంగా రూ.10వేల కోట్లు తక్కువ ఖర్చయ్యేలా సూచించిన

- మిగతా 2వ పేజీలో

### ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి...

# జాగ్రత్తగా ఉండాలి

- కొన్ని పార్టీలు ప్రతి అంశానికి కుల, మత రంగు పులుముతున్నాయని ఆరోపణ
- ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచన
- ఉద్యోగులు, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశం
- రాష్ట్రంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపు



రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ప్రతి సంఘటనకు కుల, మత రంగు పులిమి, వివాదాస్పదం చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దుష్ప్రచారం, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. విద్వేషాలను రెచ్చగొట్టేలా సాగుతున్న తప్పుడు ప్రచారాలను, ఘటనలను అరికట్టేందుకు అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. ఇటీవల జరిగిన కొన్ని నేరాలకు మానసిక సమస్యలు, మరికొన్నింటికి గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం కారణమని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వం

- మిగతా 2వ పేజీలో

## ఇసుక దందాకు నిండు ప్రాణం బలి

- ఇసుక లారీలతో మణుగూరులో ట్రాఫిక్ జామ్
- 20 కి.మీ. దూరానికి 2 గంటల సమయం
- సకాలంలో వైద్యం అందక యువకుడు మృతి



2లో



## ఆ రోజు మా అమ్మ అడిగిన ప్రశ్నకు జవాబే ఈ క్యాన్సర్ ఆసుపత్రి

- బసవతారకం ఆసుపత్రి 25 ఏళ్ల వేడుకలో భావోద్వేగంగా ప్రసంగించిన బాలకృష్ణ
- తల్లి కోరిక, తండ్రి ఆశయంతోనే ఈ సంస్థ ఏర్పాటైందని వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాతలు, ప్రభుత్వాల సహకారాన్ని గుర్తుచేసుకున్న బాలయ్య

2లో

## మూడు S'లే మా బలం...

- రిపబ్లిక్ టీవీ కాంక్లేవ్‌లో మంత్రి లోకేశ్
- ఢిల్లీలో మీడియా కాంక్లేవ్
- వేగం, స్థిరత్వం, సేవ అనే మూడు 'స'ల వల్లే ఏపీకి పెట్టుబడులన్న లోకేశ్
- 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం
- వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- 2028 నాటికి అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేస్తామని ధీమా



2లో

# స్టార్మర్ రాజీనామా

- బ్రిటన్ ప్రధాని పదవిని త్యజించిన లేబర్ పార్టీ నేత
- పీఠం నుంచి దిగిపోవాలంటూ సొంత పార్టీ ఎంపీల నుంచి ఒత్తిడి
- పగ్గాలు స్వీకరించేందుకు బర్న్‌హామ్‌కు మార్గం సుగమం



2లో



2లో

## నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

- ఆర్డీఎస్, తుంగభద్ర జలాలపై ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉత్తమ్ సమీక్ష
- తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్న ఉత్తమ్
- జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు

### లక్నో అగ్నిప్రమాదంలో

# 14 మంది మృతి..

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం
- ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారణ
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు



2లో

# రెబెల్స్ చీఫ్‌గా అరూప్

- కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్న టీఎంసీ రెబెల్ ఎమ్మెల్యేలు
- టీఎంసీకి సమాంతరంగా పార్టీ నిర్మాణం
- ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తాం
- జిల్లా కమిటీలను కూడా నియమిస్తామన్న రితబ్రత బెనర్జీ
- మమత ముఖ్య సలహాదారుగా ఉండొచ్చని వ్యాఖ్య

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి..

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో ఉన్న ఓ మూడు అంతస్తుల భవనంలోని కోచింగ్ సెంటర్‌లో చెలరేగిన మంటల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, పురానియాలోని ఓ వాణిజ్య భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే దట్టమైన పొగ భవనం మొత్తాన్ని చుట్టుముట్టడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పై అంతస్తుల నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారంతా 20 నుంచి 24 ఏళ్లలోపు వయసు వారేనని అధికారులు తెలిపారు. ఈ ప్రమాద వార్త తెలియగానే ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, అలీగఢ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని లక్నోకు తిరిగి వచ్చారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. భవనం గోడలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

# ఆ రోజు మా అమ్మ అడిగిన ప్రశ్నకు జవాబే ఈ క్యాన్సర్ ఆసుపత్రి

"ఈ రోజు నేను మీ ముందు ఒక నటుడిగానో, ప్రజాప్రతినిధిగానో నిలబడలేదు. ఒక కొడుకుగా ఈ వేదికపై ఉన్నాను" అంటూ బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్, నందమూరి బాలకృష్ణ తన ప్రసంగాన్ని భావోద్వేగభరితంగా ప్రారంభించారు. ఆసుపత్రి స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తన తల్లి బసవతారకం క్యాన్సర్‌తో పోరాడుతున్న రోజులను గుర్తుచేసుకుంటూ, ఆసుపత్రి ఏర్పాటు వెనుక ఉన్న ఆశయాన్ని వివరించారు. 1984లో తన తల్లి క్యాన్సర్‌తో బాధపడుతున్నప్పుడు, తమకు చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత ఉందని, కానీ చుట్టూ ఉన్న ఎందరో నిస్సహాయులను చూసి తన తల్లి ఆవేదన చెందారని బాలకృష్ణ తెలిపారు. "డబ్బులున్న మనం చికిత్స చేయించుకోగలుగుతున్నాం, మరి పేదల పరిస్థితి ఏంటి?" అని తన తల్లి అడిగిన ఒక సామాన్యమైన ప్రశ్నే ఈ బృహత్తర కార్యక్రమానికి పునాది వేసిందన్నారు. ఆ ప్రశ్నను తన తండ్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు ఒక బాధ్యతగా స్వీకరించి, డబ్బు లేదన్న కారణంతో ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదన్న లక్ష్యంతో 1989లో ఈ సంస్థకు పునాది వేశారని గుర్తుచేసుకున్నారు.

# ఇసుక దందాకు నిండు ప్రాణం బలి

మణుగూరు రూరల్: ఇసుక లారీల వల్ల ఏర్పడిన ట్రాఫిక్ జామ్ లో అంబులెన్స్ చిక్కుకోగా... ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తరలించలేని పరిస్థితి ఎదురైంది. ఇసుక లారీల వల్ల 20 కి.మీ దూరం ప్రయాణానికి రెండు గంటలకుపైగా పట్టడంతో నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఈ ఘటన సోమవా రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో చోటుచేసుకుంది. పినపాక మండలం గడ్డిగూడెం గ్రామానికి చెందిన కొమురం వంశీ (32) బీటీపీఎస్ ప్లాంట్‌లోని బూడిద చెరువు వద్ద డెయిలీ లేబర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన ఆయన మార్గమధ్యలో వ్యక్తిగత కార ణాలతో గడ్డి మందు తాగగా, మణుగూరు మండలంలోని దమ్మక్కపేట లో మామ వరుసయ్యే మడి శంకర్ ఇంటికి వెళ్లి విషయాన్ని చెప్పాడు. దీంతో శంకర్ 108 కు ఫోన్ చేశారు. ఆపై అంబులెన్స్ వచ్చే వరకు ఆలస్యమవుతుందని బైక్‌పై మణుగూరు-- ఏటూరునాగారం ప్రధాన రహ దారి వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి ఆటోలో మణుగూరు వంద పడకల ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. సాంబాయిగూడెం దగ్గరికి ఆటో చేరుకోగానే రామానుజ వరం--1 ఇసుక రీచ్‌కు వచ్చి వెళ్లే లారీలతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రెండు వైపులా కిలోమీటర్ మేర భారీ లారీ లు నిలిచిపోయాయి.

# నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు:

తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

# రెబెల్స్ చీఫ్‌గా అరూప్

కోల్‌కతా: మాజీ సీఎం మమతా బెనర్జీ సారథ్యంలో ఉన్న టీఎంసీని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు తిరుగుబాటు వర్గం వేగంగా పావులు కదుపుతోంది. సోమవారం ప్రతిపక్ష నేత రితబ్రత బెనర్జీ అధ్యక్షతన సమావేశమైన టీఎంసీ రెబెల్ వర్గం ఎమ్మెల్యేలు తమ చైర్‌పర్సన్‌గా అరూప్ రాయ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి కౌన్సెలర్లు, ఇతర నేతలు సైతం హాజరయ్యారు. రాయ్‌ని ఏకగ్రీవంగా పార్టీ చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నామని చెప్పారు. అంతేకాకుండా, మాజీ మంత్రి అరూప్ బిశ్వాస్, ఎమ్మెల్యేలు ఫిర్హాద్ హకీమ్, రతిన్ ఘోష్, సబినా యాస్మిన్‌లను వైస్ చైర్‌పర్సన్లుగా, రితబ్రత బెనర్జీ, జావెద్ ఖాన్, సాందీపన్ సాహాలను ప్రధాన కార్యదర్శులుగాను, అఖ్రుజ్జమాన్ అన్సారీని ట్రెజరర్‌గాను నియమించారు. మమత సారథ్యంలోని టీఎంసీని సంస్థాగతంగా సవాల్ చేసే చర్యగా దీనిని భావిస్తున్నారు.

అసెంబ్లీలో ప్రారంభమై, పార్లమెంట్‌కు సైతం పాకిన ఈ తిరుగుబాటు ఇప్పుడు పార్టీ అధిష్టానానికి కూడా





చేరుకుందనే సంకేతాన్ని ఈ పరిణామంతో స్పష్టమవుతోంది. తమ వర్గానికి చట్టబద్ధత కల్పించేందుకుగాను పార్టీ రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగానే సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించామని, ఈ వివరాలను ఎన్నికల సంఘానికి తెలియజేస్తామని బెనర్జీ స్పష్టం చేశారు. తమదే టీఎంసీ అంటూ ఆయన.. ఏది అసలైన టీఎంసీనో ఎన్నికల కమిషనే నిర్ణయిస్తుందని కూడా చెప్పారు. నూతన నాయకత్వం త్వరలోనే వివిధ స్థాయిల్లో పార్టీ నియామక, సంస్థాగత నిర్మాణాన్ని పునరుద్ధరిస్తుందని ఆయన చెప్పారు. త్వరలోనే జిల్లా కమిటీలను, రాష్ట్ర విభాగాన్ని, ప్రతినిధుల ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇష్టమైతే, తమ వర్గానికి మమతా బెనర్జీ ముఖ్య సలహాదారుగా ఉండవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ఆమె ముఖ్య సలహాదారుగా వస్తానంటే సాదరంగా స్వాగతిస్తామని చెప్పారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి తర్వాత టీఎంసీ పార్టీలో మునుపెన్నడూ లేని రీతిలో తీవ్ర సంక్షోభం తలెత్తడం తెలిసిందే. అసెంబ్లీకి ఎన్నికైన 80 మందికిగాను ఏకంగా 58 మంది రెబెల్ వర్గంలో చేరగా, పార్లమెంట్‌లో 28 మంది ఎంపీల్లో 20 మంది వేరు కుంపటి పెట్టుకున్నారు.

# మూడు 'S'లే మా బలం...

పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ వైపు మొగ్గు చూపడానికి వేగం అనే మూడు "S"లే ప్రధాన కారణమని, అవే తమ ప్రభుత్వ విజయ రహస్యాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో రిపబ్లిక్ టీవీ నిర్వహించిన కాంక్లేవ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిపబ్లిక్ టీవీ చీఫ్ ఎడిటర్ ఆర్నబ్ గోస్వామి అడిగిన పలు ప్రశ్నలకు లోకేశ్ సూటిగా, స్పష్టంగా సమాధానాలిచ్చారు. ఏపీ అభివృద్ధి ప్రణాళిక, తమ ప్రభుత్వ ప్రాధాన్యతలను జాతీయ వేదికపై సమగ్రంగా వివరించారు. ఈ చర్చను ఆర్నబ్ గోస్వామి తన పాత జ్ఞాపకాలతో ప్రారంభించారు. "మీ తండ్రి చంద్రబాబు గారు 90వ దశకం చివర్లో కేంద్ర రాజకీయాల్లో కీలకంగా ఉన్నప్పటి నుంచి నాకు తెలుసు. అప్పట్లో మాతో చాలా చనువుగా ఉండేవారు. ఇప్పుడు మిమ్మల్ని చూస్తుంటే ఆ రోజులు గుర్తొస్తున్నాయి. మీలో మీ నాన్నగారి పోలికలు, అదే ఆకర్షణ కనిపిస్తున్నాయి. అందుకే మిమ్మల్ని ప్రజలు మరింత దగ్గరగా తెలుసుకోవాలని కోరుకుంటున్నాను" అంటూ లోకేశ్ ను సంభాషణలోకి ఆహ్వానించారు. ఆర్నబ్ అడిగిన ఈ ప్రశ్నకు లోకేశ్ బదులిస్తూ, "ఇదొక అద్భుతమైన ప్రయాణం. రాజకీయమనేది గమ్యం కాదు, ఒక నిరంతర ప్రయాణం. దేవుడి దయ, ప్రజల ఆశీస్సులు ఉంటే నాకు ఇంకా 40-50 ఏళ్ల రాజకీయ భవిష్యత్తు ఉంది. గత పదేళ్లలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. విజయాలు, పరాజయాలను సమానంగా స్వీకరించాను. ప్రస్తుతం యువ నాయకులు బాధ్యతలు స్వీకరించి దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాల్సిన సమయం ఇది. నేను అదే బాటలో పయనిస్తున్నాను" అని తెలిపారు.

**ముఖ్యమంత్రి మీకు ఇచ్చిన లక్ష్యం ఏంటి?**

"2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనేది మా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన విజన్. ఆయనకు పనులు ఎప్పుడూ వేగంగా జరిగిపోవాలి. అలాంటి బాస్ ఉన్నప్పుడు ఆయన వేగాన్ని అందుకోవడం కష్టమే అయినా, ఆ ప్రయత్నంలోనే ఉన్నాను. ప్రస్తుతం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించేందుకు ఏర్పాటు చేసిన మంత్రుల బృందానికి నేను చైర్మన్‌గా ఉన్నాను. ఉద్యోగాల సృష్టే నా ఏకైక లక్ష్యం. ఇదే నన్ను రేయింబవళ్లు పనిచేసేలా చేస్తోంది" అని లోకేశ్ వివరించారు. "మేం మూడు 'S'ల ఫార్ములాను నమ్ముకున్నాం. అవే వేగం, స్థిరత్వం, సేవ. మా వేగానికి నిదర్శనమే దేశ చరిత్రలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ అయిన గూగుల్ డేటా సెంటర్ కేవలం 13 నెలల్లో, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ 17 నెలల్లో పనులు ప్రారంభించడం. స్వదేశీ ఫైటర్ జెట్ తయారీ ప్రాజెక్టు ఏఎంసీఏకు 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చాం. రెండోది స్థిరత్వం. మా నాయకుడికి అభివృద్ధిపై స్పష్టమైన ట్రాక్ రికార్డ్ ఉంది. మూడోది సేవ. వ్యాపారవేత్తలను నేను దేశ నిర్మాతలుగా చూస్తాను. వారికి సేవ చేయడం నా బాధ్యత. ఈ మూడు 'S'ల వల్లే దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25% ఏపీకే వస్తున్నాయి" అని లోకేశ్ అన్నారు. ఢిల్లీలో మీకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోందా, అమరావతికి కేంద్రం నుంచే నిధులు వస్తున్నాయా అన్న ప్రశ్నకు లోకేశ్ స్పందిస్తూ, "ఎక్కువ ఎంపీలు ఉండటం వల్ల మా గొంతు గట్టిగా వినిపించడానికి అవకాశం దొరికింది. కానీ, రాష్ట్రాల మధ్య పోటీతత్వం ఉంటేనే దేశం గెలుస్తుంది.

# మెట్రోపై సానుకూలం

(మొదటి పేజీ తరువాయి)



ఆర్ఆర్‌టీఎస్ ఫార్ములాకు రాష్ట్ర ప్రభుత్వం జరుఒప్పుకోలేదనే విషయాన్ని కిషన్ రెడ్డి ప్రస్తావించినట్లు తెలిసింది. మెట్రో రెండో దశకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన విషయాన్ని అశ్వినీ వైష్ణవ్ చెప్పినట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కోసం సంయుక్త కమిటీ ఏర్పాటు చేస్తే, తద్వారా సమన్వయ ప్రక్రియ ఆలస్యం లేకుండా మెట్రో విస్తరణ వేగవంతమవుతుందనే విషయాన్ని ఇద్దరు కేంద్ర మంత్రులూ రేవంత్‌రెడ్డితో అన్నట్లు తెలిసింది.

**మెట్రో ఫేజ్--2 50:50 నిష్పత్తిలో..**

హైదరాబాద్ మెట్రో ఫేజ్--1లో ఈక్విటీ షేర్ కొనుగోలుకు రూ.1,461.47 కోట్లు, ప్రాజెక్టు అప్పుల రీఫైనాన్సింగ్‌కు రూ.13,538.53 కోట్లు కలిపి మొత్తం రూ.15వేల కోట్ల లావాదేవీలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీ మేరకు ఐఆర్ఎఫ్‌సీ రుణం మంజూరు చేయడానికి ఒప్పందం కుదిరింది. అయితే, జూన్ 15న మొదటి విడత రుణం విడుదల కాలేదని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అశ్వినీ వైష్ణవ్‌కు చెప్పారు. ఆ రుణం విడుదల చేయడంతోపాటు మెట్రో ఫేజ్--2ను 50:50 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా చేపట్టేలా ఆమోదించాలని కోరారు. భేటీ అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. చర్చలు సానుకూలంగా సాగినట్లు చెప్పారు. మంగళవారం కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమైన తర్వాత, మెట్రో ప్రాజెక్టు సమస్యలు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఖట్టర్, రేవంత్ భేటీలో కిషన్‌రెడ్డి కూడా పాల్గొననున్నారు.


**పరస్పర సవాళ్ల మధ్య భేటీ**

హైదరాబాద్ మెట్రో రైలు వ్యవహారం ముందుకెళ్లకుండా మోకాలడ్డుతున్నారంటూ కిషన్‌రెడ్డిపై కొన్నిరోజులుగా రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి కిషన్‌రెడ్డి స్పందిస్తూ ఎన్నికల హామీల అమలులో తమ వైఫల్యంపై ప్రజల దృష్టి మళ్లించడానికే రేవంత్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులివ్వొద్దని తాను ఏ మంత్రికి చెప్పానో నిరూపించగలరా? అని సవాలు కూడా విసిరారు. అయితే తాను రెండ్రోజుల ఢిల్లీ పర్యటనకు వస్తున్నానని, అప్పుడు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని రేవంత్ బహిరంగ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో రైల్వే మంత్రితో రేవంత్ రెడ్డి, కిషన్‌రెడ్డి సమావేశమవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి... జాగ్రత్తగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

పాత కేసులను సైతం పరిష్కరిస్తోందని, 2019లో జరిగిన నేరాలను ఇప్పుడు గుర్తించి నిందితులను పట్టుకుని శిక్షలు పడేలా చేస్తున్నామని తెలిపారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరనే వాస్తవాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. వాహనాల నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగానే నంబర్ ప్లేట్లు ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సాంకేతికత కీలకమని, ఈ నేపథ్యంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత, జల భద్రత, భూగర్భ జలాల రీఛార్జ్, నదుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ద ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద వచ్చే అర్జీలను సానుభూతితో పరిశీలించాలన్నారు. "సమస్య పరిష్కారం కోసం తమ దగ్గరకు వచ్చే పౌరులతో అధికారులు, ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తించాలి. వారి స్థానంలో మనమే ఉంటే ఎలా ఆలోచిస్తామో అలా ఆలోచించి సేవలు అందించాలి. ఇది పరిపాలనపై



ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది" అని ఆయన హితవు పలికారు. ఉద్యోగుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తామని, పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని తేల్చిచెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారానే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుందని, మంత్రులు, అధికారులు, ఉద్యోగులు దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఫైళ్ల క్లియరెన్స్ సులభమైందని, అయితే వినూత్న ఆలోచనలు లేకపోతే వ్యవస్థలు నిస్సారంగా మారతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్టార్మర్ రాజీనామా

లండన్: దశాబ్దకాలంగా తరచూ ప్రధానమంత్రి పదవి నుంచి అగ్రనేతలు వైదొలగుతున్న దృశ్యం మరోసారి బ్రిటన్‌లో కన్పించింది. సమర్థవంతమైన పరిపాలన అందించట్లేదంటూ సొంత లేబర్ పార్టీ ఎంపీల నుంచే తీవ్రస్థాయిలో ఒత్తిడి నేపథ్యంలో బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామాచేశారు. లేబర్ పార్టీ నేత హోదా నుంచీ తప్పుకుంటున్నట్లు సోమవారం ప్రకటించారు. సెప్టెంబర్‌లో తదుపరి ప్రధాన మంత్రిని ఎన్నుకునేదాకా తాత్కాలిక ప్రధానిగా కొనసాగుతానని 63 ఏళ్ల స్టార్మర్ వెల్లడించారు. త్వరలో కొలువుతీరే ప్రభుత్వానికి తన పూర్తి మద్దతు, సంపూర్ణ సహకారం కొనసాగుతుందని ఆయన స్పష్టంచేశారు. గత వారం బ్రిటన్ పార్లమెంట్ దిగువ సభ(హౌస్ ఆఫ్ కామన్స్) నియోజకవర్గం మేకర్‌ఫీల్డ్ ఉపఎన్నికల్లో గెలిచిన సొంత పార్టీ ముఖ్యనేత ఆండీ బర్న్‌హామ్ ఇప్పుడు ప్రధానమంత్రి రేసులో ముందంజలో ఉన్నట్లు యూకే మీడియాలో కథనాలు వెలువడ్డాయి. "తదుపరి ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తా"అని బర్న్‌హామ్ చేసిన ప్రకటన ఈ వాదనలకు మరింత బలం చేకూరుస్తోంది. రాజీనామాకు ముందే స్టార్మర్ సోమవారం ఉదయం బ్రిటన్ రాజు చార్లెస్--3తో భేటీ అయి తన రాజీనామా అంశాన్ని వెల్లడించారు. రాజీనామా చేశాక లండన్‌లోని ప్రధానమంత్రి కార్యాలయం 10, డౌనింగ్ స్ట్రీట్ భవనం నుంచి స్టార్మర్ బయటికొచ్చి మీడియాతో భావోద్వేగంతో మాట్లాడారు.



## రెడ్డిపల్లి గ్రామంలో నూతన కూరగాయల మార్కెట్ ప్రారంభం

**నర్సాపూర్ కాంసెన్సీ:** మెదక్ జిల్లా నర్సాపూర్ తాలూకా లోని గ్రామ ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉండేలా రెడ్డిపల్లి గ్రామంలో నూతన కూరగాయల మార్కెట్‌ను గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు పండించిన తాజా కూరగాయలను నేరుగా వినియోగదారులకు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఆదివారం కూరగాయల మార్కెట్ నిర్వహించడం జరుగుతుంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు గ్రామ ప్రజలకు తాజా కూరగాయలు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు గ్రామ పంచాయతీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. నూతన కూరగాయల మార్కెట్ ప్రారంభం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సందు గూడెం మక్తకుంటను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు

**చట్టపరంగా చర్యలు తప్పవు,..పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**రామచంద్రాపురం:** సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ డివిజన్ సందుగూడెం పరిధిలో గల మక్త కుంట చెరువును ఆక్రమించేందుకు ఇటీవల కొందరు ప్రయత్నిస్తున్నారని.. గజం భూమిని కబ్జా చేసిన క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం నీటిపారుదల శాఖ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి ఆయన చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ సందు గూడెం పరిధిలో గల మక్తకుంట చెరువులో ఇటీవల కొందరు వ్యక్తులు తమ శిఖం భూమి పేరుతో మట్టిని నింపుతూ చెరువును కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు తన ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే తానే స్వయంగా క్షేత్రస్థాయి పర్యటనకు రావడం జరిగిందని తెలిపారు. గ్రామానికి అనుసంధానంగా గల చెరువు కట్ట రహదారిని సైతం ధ్వంసం చేయడం అత్యంత దారుణమని అన్నారు. దశాబ్దాలుగా ఇదే రహదారిని ఉపయోగిస్తూ అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్నారని తెలిపారు. చెరువు శిఖం పట్టాలో వ్యవసాయం చేయాలే తప్ప మట్టిని నింపుతూ చిరున ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రెండు రోజుల్లోగా చెరువు కట్టను పునరుద్ధరించడంతోపాటు చెరువును ఆక్రమిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నీటి పారుదల శాఖ ఈఈ భీమ్ ఆదేశించారు. గజం భూమిని కబ్జా చేసిన వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజయ్ కృష్ణ, నీటిపారుదుల శాఖ ఈఈ బీమ్, ఏఈ జ్యోతి, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, కొమరయ్య, సీనియర్ నాయకులు రమేష్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లుగా పీజీ సోషల్ వర్కర్లను తీసుకోవాలి

**ఉపాధ్యాయులపై పని భారం సరికాదు**

**స్వాన్ ఇండియా నిర్మల్ జిల్లా అధ్యక్షులు కొమ్మోజీ స్వామి**




**నిర్మల్ టౌన్, 22 జూన:** తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లను నియమించడానికి సన్నహాలు చేస్తున్న విషయం వందరికీ తెలిసినదేనని, తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని ఉన్నత పాఠశాలలను ఈ నియమాకాలు చేయడానికి ముందుకు రావడం చాలా సంతోషకరమైన విషయం అయినప్పటికీ, ఇక్కడే మీకు మేము మా యొక్క విజ్ఞప్తి తెలియజేస్తున్నాం అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ సబ్జెక్టులలో పాఠ్యాంశాలు బోధిస్తున్నటువంటి ఉపాధ్యాయులలో ఒకరిని ఎంపిక చేసుకొని వారికి న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో చట్టాల పట్ల శిక్షణ ఇచ్చి వారిని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా 5711 మంది ఉపాధ్యాయులను నియమించడం ఎంతవరకు సమంజసము మాకు అర్థం కావడం లేదని స్వాన్ ఇండియా నిర్మల్ జిల్లా అధ్యక్షులు కొమ్మోజీ స్వామీ అభిప్రాయ పడ్డారు. వారు విద్యార్థులకు ఎప్పుడు పాఠ్యాంశాలు బోధిస్తారని, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా వారు బాధ్యత ఎప్పుడూ నిర్వర్తిస్తారని పని భారంతో తీవ్రమైన ఒత్తిడితో విద్యార్థులకు సరియైన న్యాయం జరగదని వెల్లడించారు. సోషల్ వర్క్ పూర్తి చేసిన అభ్యర్థులను శాశ్వత ప్రతిపాదికను చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నియమించాలని ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖను కోరుతున్నామని ఒక ప్రకటనలో తెలియజేసారు.

# మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం

**మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**



**మెదక్ జిల్లా, :** మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు పై కేటీఆర్ బ్యాచ్ గ్లోబల్ ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు మీలా కమిషన్లు తీసుకొని, బ్రోకర్ బ్రోకర్ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ నేతలకు రాదని అన్నారు. మెదక్లో ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని ఆరోపించడం సరి కాదు అన్నారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఈ యాసంగిలో 4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, రికార్డు స్థాయిలో ధాన్యం రావడం వల్ల కొంత ఆలస్యం అయిందన్నారు. రైతుల సమస్య కోసం కాంగ్రెస్ పార్టీయే ముందుగా ధర్నా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి వరకు 90 శాతం మంది రైతులకు ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. ఇప్పటి వరకు మెదక్లో వెయ్యి కోట్ల అభివృద్ధి జరిగిందని, కావాలంటే నిధుల వివరాలు బీఆర్ఎస్ నేతలకు పంపిస్తామని చెప్పారు. గతంలో వారి పాలనలో జరిగినట్టు ఇసుక అమ్మకోలేదని, మెదక్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోలేదన్నారు. అప్పుడు మీరు మీ షాడో ఎమ్మెల్యే ఏమి చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే టిక్కెట్ పరేషాన్ వల్ల ఆమె మాట్లాడుతుందని ఎద్దేవా చేశారు. వర్షాకాలంలో ప్రాణాలకు తెగించి వరదల్లో చిక్కుకున్న వారిని మా నేత దగ్గర ఉంది కాపాడదని, తమంత వెంటే ఉన్నామన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ వచ్చి రివ్యూ చేసిన విషయం బీఆర్ఎస్ నేతలు మరచిపోయినట్లు ఉన్నారని, అందుకే వరదలు వచ్చిన పట్టించుకోనట్లు మాట్లాడుతున్నారని అన్నారు. ప్రభుత్వం కార్యాలయాలు తరలిపోతుంటే చేతులు ముడుచుకు కూర్చున్న మీరు ఇప్పుడు అభివృద్ధి లేదని ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మెదక్ నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, చర్చకు రావాలని పిలుపునిచ్చారు. మెదక్లో జరిగిన అభివృద్ధి వివరాలు బీఆర్ఎస్ నేతలకు పంపిస్తామని, అప్పుడే జరిగిన అభివృద్ధి తెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేశ్ గౌడ్, మెదక్ పట్టణ అధ్యక్షులు గంగాధర్, మాజీ చైర్మన్ రాగి అశోక్, హఫీజ్, నాగరాజు, రమేష్, మహిపాల్ రెడ్డి, శ్రీకాంత్, తాహెర్, విశ్వం, రాజశేఖర్, కౌన్సిలర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

# లక్షెట్టిపేట ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు





**లక్షెటిపేట, జూన్ 22:** లక్షెటిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పరిస్థితులను, చికిత్స పొందుతున్న రోగులను స్వయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమైన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆసుపత్రిలో పరిశుభ్రత, రోగులకు మెరుగైన సేవలు అందించే విషయంలో పలు సూచనలు చేశారు. ఆసుపత్రి పవిత్రతను కాపాడే ఉద్దేశ్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సహా ఎవరైనా ఆసుపత్రి లోపలికి ప్రవేశించే సమయంలో చెప్పులు బయట విడిచి రావాలని వైద్యులకు సూచించారు. అనంతరం మున్సిపాలిటీలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులపై స్పందిస్తూ పట్టణ అభివృద్ధికి అత్యంత కీలకమైన రోడ్డు వెడల్పు పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపేది లేదని, ఎవరి అడ్డంకులు వచ్చిన అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం రైతులు పండించే ధాన్యం కోసం లక్షెట్టిపేట మున్సిపాలిటీ శివారులో గోడం ల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్, ఎమ్మార్వో దిలీప్ , సిఐ రమణమూర్తి, ఎస్సై సురేష్, మున్సిపల్ చైర్ పర్సన్ దొంత అంజలి - నర్సయ్య , వైస్ చైర్ పర్సన్ మోత్కూరి రాజేశ్వరి- వెంకటస్వామి గౌడ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్, వైస్ చైర్మన్ ఆరీఫ్ , కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, జిల్లా ఆర్ జీ పి ఆర్ ఎస్ గడ్డం త్రిమూర్తి, జిల్లా నాయకులు చల్లా నాగభూషణం , పూర్ణచందర్ రావు, సర్పంచులు , కౌన్సిలర్లు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంగిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలి

**జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందచేత**

**తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్**



**నిర్మల్ టౌన్, 22 జూన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు విద్యాసంస్థల అధిక ఫీజులు చేస్తూ పుస్తకాలు,బ్యాగులు, యూనిఫాంలు అక్రమ విక్రయాలను, విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని దానితోపాటు ఎటువంటి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక రేట్లకు నోటు పుస్తకాలు, అమ్మడం జరుగుతుంది ప్రైవేటు స్కూల్ యజమాన్యాలపే పరమైన చర్యలు తీసుకొని బయట అమ్ముతున్న షాపులను వెంటనే సీజ్ చేయాలని తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పల్లపు తులసీరామ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థలు ట్రేడింగ్ లైసెన్స్ లేకుండా, ఒరిజినల్ బిల్స్ ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంతో బుక్స్, యూనిఫామ్ షూస్, బ్యాగ్స్, స్టేషనరీ సామాన్లని బయట సెటర్లో పెట్టి విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. తెలియజేయడం జరిగింది. వాటిని వెంటనే సీజ్ చేసి వాటికి సంబంధించిన పాఠశాలల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. లేనిపక్షంలో తెలంగాణ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు రత్నల్లి రాజశేఖర్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముల్క సందీప్, పాల్గొన్నారు.

# బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

**మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ లో ఘనంగా బ్లాక్ బెల్ట్ అవార్డింగ్ సెర్మనీ 2026**



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జూన్ 22:** మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గండి మైసమ్మలోని ప్రగతి మోడల్ హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రాండ్ మాస్టర్ ప్రసాద్, ఆల్ ఇండియా గ్రాండ్ మాస్టర్ వెంకటేశ్వర్, మాస్టర్ నరేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అకాడమీ ఫౌండర్, డైరెక్టర్, చీఫ్ ఎగ్జామినర్ బెస్త నరేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలర్ బెల్ట్ మరియు బ్లాక్ బెల్ట్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. మొత్తం 15 మంది విద్యార్థులు నూతనంగా బ్లాక్ బెల్ట్ సాధించి అవార్డులు అందుకున్నారు. ప్రగతి మోడల్ హైస్కూల్ డైరెక్టర్ సురేష్ గౌడ్ చేతుల మీదుగా 50 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులకు బ్లాక్ బెల్ట్, ప్రీమియం సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ వెంకట్ రెడ్డి, రూహి,లెస్సికా,స్ఫూర్తి, మహేశ్వరి, రోహిత్,సునీల్ యాదవ్, హర్షిత్,లోక్షిత్,సాయి చరణ్ చారి,అక్షయ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు తల్లిదండ్రులు, నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

## ఫిలిప్పీన్స్‌లో కాల్పుల కలకలం

### స్కూల్లో కాల్పులకు తెగిచిన సాయుధులు

### ముగ్గురు విద్యార్థులు అక్కడిక్కడే మృతి

న్యూఢిల్లీ: ఫిలిప్పీన్స్‌లో దారుణం జరిగింది. టాక్లోబన్‌లోని శాన్ హోసే నేషనల్ హైస్కూల్‌లో కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ఇద్దరు సాయుధులు అక్రమంగా పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి విద్యార్థులపై విచక్షణా రహితంగా తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ఐదుగురికి తీవ్రమైన బబుల్లెట్ గాయాలు అయ్యాయి. ఫిలిప్పీన్స్‌లో కొద్దికాలంగా అక్రమ ఆయుధాల చలామణి పెరిగిపోయింది. దీంతో ఇటీవల తుపాకీ సంబంధిత నేరాలు సర్వసాధారణం అయిపోయాయి. అయితే, పాఠశాలల్లో కాల్పులకు తెగబడటం చాలా అరుదైన ఘటనని స్థానిక మీడియా, అధికారులు చెబుతున్నారు. ఈ పాఠశాలలో మొత్తం 1,500మంది విద్యార్థులు ఉండగా.. కాల్పుల ఘటనతో పాఠశాల సిబ్బంది సహా వారంతా బయటకు పరుగులు తీశారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి దాడికి ఉపయోగించిన తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అయితే, నిందితుల్లో ఒకరిని అదే పాఠశాలకు చెందిన విద్యార్థిగా పోలీసులు గుర్తించారు. మరోవైపు దాడిలో గాయపడిన ఐదుగురిని సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనతో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ మేరకు పాఠశాల చుట్టుపక్కల ప్రాంతమంతా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాల్పులకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కాగా,

## అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి

హైదరాబాద్:ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు విద్యార్థి అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణకు చెందిన 26 ఏళ్ల అరుణ్ సాయి రెడ్డి బొ÷-లలెందుల అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అరుణ్ స్వస్థలం మహబూబ్‌నగర్. ప్రస్తుతం ఫ్లోరిడాలోని టెంపాలో నివసిస్తోన్న అతడు.. స్టెమ్ ఓపీటీలో ఉన్నాడు. ఫుల్ టైమ్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోన్న అరుణ్.. జూన్ 19న ఉన్నట్టుండి అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## తల్లి మందలింపుతో పారిపోయిన అక్కాచెల్లెళ్లు

### ఏలూరులో ప్రత్యక్షమైన సోదరీమణులు

హైదరాబాద్:తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. హైదరాబాద్‌లో అదృశ్యమైన ఆ ముగ్గురూ ఏపీలో ప్రత్యక్షమయ్యారు. ఈ ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫోన్ ఎక్కువగా చూస్తున్నారని తన ముగ్గురు కుమార్తెలను తల్లి మందలించింది. దీంతో ఆ ముగ్గురూ ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో తన పిల్లలు కనిపించడం లేదని వారి తల్లి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఏలూరులో ఉన్నట్లు తేలింది. వారిని తిరిగి హైదరాబాద్ తీసుకొస్తున్నారు.

## బయ్యారంలో అడవి జంతవుల మాంసం విక్రయం

### తనిఖీల్లో పట్టుకున్న అటవీశాఖ అధికారులు

మహబూబాబాద్,జూన్22(ఆర్ఎన్ఎ):మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని కాకతీయనగర్‌లో అడవి జంతువుల మాంసం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అయితే అధికారుల రాకను గమనించిన కొందరు స్మగ్లర్లు అక్కడి నుంచి పరారయ్యారు. అధికారుల తనిఖీ సమయంలో మాంసం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌తో వేటగాళ్లు వాగ్వాదానికి దిగారు. పరిస్థితిని అదుపులోకి తీసుకున్న అధికారులు విచారణ చేపట్టారు. అధికారుల తనిఖీల్లో సుమారు 30 కిలోల అడవి జంతువుల మాంసంతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై సంబంధిత అటవీ చట్టాల కింద అధికారులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అడవి జంతువుల వేట, మాంసం విక్రయం, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు ప్రజలు కూడా సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

## చెత్తను వేర్వేరుగా వర్గీకరించి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలి

### గోపాల్ నగర్‌లో స్వచ్ఛ తెలంగాణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం

తాండూర్: ప్రతి ఇంటిలో ఉత్పత్తి అయ్యే తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్తతో పాటు ప్రత్యేక హానికరమైన వ్యర్థాలను వేర్వేరుగా వర్గీకరించి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నర్సయ్య గ్రామ ప్రజలకు సూచించారు. తాండూర్ మండలంలోని గోపాల్ నగర్ గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గాట్ల నర్సయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులకు ఘనంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణపై ప్రజలకు వివరించి, చెత్తను సరైన విధంగా వర్గీకరించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గాట్ల నర్సయ్య మాట్లాడుతూ, తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ వ్యర్థాలు, హానికరమైన వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం వల్ల వ్యర్థాల నిర్వహణ సులభతరం కావడంతో పాటు గ్రామ పరిశుభ్రత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద నుంచే చెత్తను వర్గీకరించే అలవాటు పెంపొందించుకోవాలని, దీంతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించవచ్చని అన్నారు.

# మనందరికి సుప్రీం లీడర్ కేసీఆర్: ఎంపీ వద్దిరాజు

### తెలంగాణ ప్రజలకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష: ఎంపీ వద్దిరాజు

### బీ ఆర్ఎస్ ఘన విజయం సాధించడం, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం తథ్యం: ఎంపీ వద్దిరాజు

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మనందరికి సుప్రీం లీడర్ అని,ఆయన నాయకత్వమే రాష్ట్రానికి,ప్రజలకు శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. ఈ పార్టీలో ముఠాలకు,వర్గాలకు ఏ మాత్రం తావు లేదని,మనమందరం కూడా కేసీఆర్ నాయకత్వాన గులాబీ జెండా కింద పని చేస్తూ ముందుకు సాగుదామన్నారు. ఖమ్మం జిల్లా వైరాలోని కమ్మ వారి కళ్యాణ మండపంలో సోమవారం సభ్యత్వ నమోదు,ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు జరిగింది. దీనికి ఎంపీ రవిచంద్ర, పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంఛార్జి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ,ఇతర పార్టీలలో మాదిరిగా బీఆర్ఎస్ లో వర్గాలు అనేవి ఉండవని,మనమంతా కూడా మహానేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావుల మార్గ నిర్దేశనంలో పని చేస్తూ ముందుకు సాగాలన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, నాయకులు,కార్యకర్తల



పనితీరును కేసీఆర్, కేటీఆర్ లు గమనిస్తుంటారన్నారు. సభలు,సమావేశాలు ఎక్కడ జరుగుతున్నాయో,ఎవరేం పని చేస్తున్నారో,ఏం మాట్లాడుతున్నారో,ఎవరి బలమెంతనో కేసీఆర్, కేటీఆర్ లకు తెలుసని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. వారి ముందు ఎవరి ఆటలు సాగవని, సిఫార్సులు,పైరవీలు నడవని, పార్టీని నమ్ముకుని గులాబీ జెండా మోస్తూ కష్టపడి పని వారిని తప్పకుండా గుర్తించి అవకాశాలు,పదవులు ఇస్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసులను అడ్డం పెట్టుకుని పాలన సాగిస్తున్నారని, గులాబీ సైనికులపై అక్రమంగా కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతున్నారని ఎంపీ రవిచంద్ర విమర్శించారు. ఆరు నెలల తర్వాత ఆయన మాటల్ని,ఆదేశాలను మంత్రులు,అధికారులు కూడా పట్టించుకోరన్నారు. రెండేళ్లలో జరిగే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ అద్భుతంగా గెల్చి రాష్ట్రంలో అధికారం చేపట్టడం,కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఎంపీ రవిచంద్ర ధీమాగా చెప్పారు. అప్పుడు పార్టీ కోసం అంకితభావంతో పని చేసిన వారికి పదవులు రావడం,రాష్ట్రం గొప్పగా అభివృద్ధి చెందడం జరుగుతుందని వివరించారు. ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా 18 నిండిన వారందరి ఓట్లను నమోదు చేయించాలని,ఉన్న ఓట్లు గల్లంతు కాకుండా మరింత అప్రమత్తంగా ఉండాలని గులాబీ శ్రేణులకు ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గుండాల కృష్ణ (ఆర్జేసీ),బొమ్మెర రాంమూర్తి, గిరిబాబు,కృష్ణార్జున్,మనీషా లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "జై తెలంగాణ జైజై తెలంగాణ","వర్థిల్లాలి వర్థిల్లాలి కేసీఆర్ నాయకత్వం వర్థిల్లాలి","జిందాబాద్ జిందాబాద్ బీఆర్ఎస్ జిందాబాద్","రేవంత్ రెడ్డి పోవాలి-కేసీఆర్ రావాలి"అనే నినాదాలు మిన్నంటాయి.

# రైతు భరోసా: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్:౹ తెలంగాణలోని అన్నదాతలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆర్థిక భారం ఎక్కువైనా సరే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈనెల 30న ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరగనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. ఈ విడతలో మొత్తం 73 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 9,000 కోట్లను జమ చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. గత యాసంగి సీజన్‌లో కేవలం రెండు ఎకరాల లోపు ఉన్న వారికే పెట్టుబడి సాయం అందించడంతో రైతుల నుంచి కొంత వ్యతిరేకత వచ్చింది. ఈసారి ఆ పరిస్థితి రాకుండా అందరికీ ఒకేసారి నిధులు జమ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒకవేళ నిధుల కొరత ఏమైనా ఎదురైతే, మొదట ఎకరం చొప్పున ప్రారంభించి, 9 రోజుల్లో పూర్తిగా పంపిణీ పూర్తి చేసేలా వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ ప్లాన్‌ను కూడా సిద్ధం చేసుకుంది. గత ప్రభుత్వంలా కాకుండా.. ప్రజల సొమ్ము వృథా కాకుండా కేవలం నిజమైన, సాగు చేసే రైతులకే ఈ సాయం అందేలా రేవంత్ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోబోతోంది. రాష్ట్రంలో ఉన్న 1.50 కోట్ల ఎకరాల భూమిలో సాగుకు పనికిరాని పడావు భూములు, రియల్



ఎస్టేట్ లేఅవుట్లు, కాలువలు, కుంటలు, బీడు భూములు ఉన్న 20 నుంచి 25 లక్షల ఎకరాలను భరోసా జాబితా నుంచి ఇప్పటికే తొలగించనున్నారు. ధనవంతులైన పెద్ద రైతులకు కాకుండా పేద, మధ్యతరగతి రైతులకు లబ్ధి చేకూర్చేలా ఈ వానాకాలం సీజన్ నుంచి 7.20 గుంటల వరకు భూమి ఉన్న వారికే భరోసా సాయం పరిమితం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. 10 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్నవారిని ఈ జాబితా నుంచి మినహాయించే అవకాశం ఉంది. పత్తి వంటి పంటలు రబీలో సాగు చేయనందున,రైతు భరోసాను కేవలం ఒకే ఒక ప్రధాన ఖరీఫ్ సీజన్‌కే పరిమితం చేయాలా? అనే కోణంలోనూ ప్రభుత్వ పెద్దలు సమాలోచనలు చేస్తున్నారు. ఎన్నికల హామీ ప్రకారం ఎకరానికి రూ. 15 వేలు ఇస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తిరుగుండదని, అలాగే కౌలు రైతులను ఆదుకునేందుకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కొందరు మంత్రులు సీఎంకు ప్రతిపాదనలు పెట్టారు. ఇకపై రైతు భరోసాలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం హైటెక్ టెక్నాలజీని వాడుతోంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్విట్జర్లాండ్ దేశానికి చెందిన సార్ మ్యాప్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని శాటిలైట్ చిత్రాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో ఏ గ్రామంలో, ఏ సర్వే నంబర్‌లో, ఏ పంట వేశారనేది 95 శాతం ఖచ్చితత్వంతో గుర్తించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద జిల్లాకు 5 గ్రామాలను ఎంపిక చేసి ఏఈఓ లతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించగా శాటిలైట్ వివరాలు, క్షేత్రస్థాయి వివరాలు ఒక్కటిగానే వచ్చాయి. దీనివల్ల కేవలం పంట సాగు చేసిన వారికే ప్రభుత్వ పథకాలు అందుతాయి. అంతేకాకుండా ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే నేరుగా నష్టపరిహారం అందించడానికి, విత్తనాలు-ఎరువులు ముందే సిద్ధం చేసుకోవడానికి ఈ డేటా ప్రభుత్వానికి ఎంతో ఉపయోగపడనుంది. ప్రభుత్వం తీసుకోబోతున్న ఈ విప్లవాత్మక మార్పులతో నిజమైన పేద రైతులకు పూర్తి స్థాయిలో భరోసా దక్కనుందని స్పష్టమవుతోంది.

## సాయికృష్ణ లాకప్ డెత్ కేసును సీబీఐకి అప్పగించాలి

### స్వతంత్ర దర్యాప్తు సాగితేనే కూటమి ప్రభుత్వంపై నమ్మకం

### మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి డిమాండ్

చిత్తూరు: సాయికృష్ణ లాకప్ డెత్ కేసును సీబీఐకి అప్పగించాలని వైసీపీ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి డిమాండ్ చేశారు. చిత్తూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నమ్మాలంటే ఈ కేసుపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని అన్నారు. సాయికృష్ణ నిజంగా నేరస్తుడే అయితే కోర్టులు శిక్షించి ఉండేవని నారాయణస్వామి పేర్కొన్నారు. టెర్రరిస్టులను ఎన్‌కౌంటర్ చేసిన సందర్భాల్లో కూడా వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తారని గుర్తు చేశారు. సాయికృష్ణ తల్లి తన కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని, అయితే ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమెను పిలిపించి మాట్లాడటం ఆశ్చర్యకరంగా ఉందని విమర్శించారు. తమిళనాడులో జరిగిన పోలీసుల లాకప్ డెత్ ఘటనలపై కోర్టులు తీవ్ర వ్యాఖ్యలు చేశాయని, అదే విధంగా సాయికృష్ణ కేసులో కూడా పూర్తి స్థాయి విచారణ జరగాలని నారాయణస్వామి కోరారు.. అలాగే క్రాంతికుమార్‌ను సీఐ నాగరాజ్ వేధించిన అంశాన్ని కూడా సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ పాలన వల్లే క్రాంతికుమార్, సాయికృష్ణ మృతికి కారణమైన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన ఆరోపించారు. హోంమంత్రి శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలను విస్మరించి ముఖ్యమంత్రి చంద్రబాబు భజనకే పరిమితమయ్యారని విమర్శించారు. తిరుపతిలో మంత్రి లోకేష్ రెడ్‌బుక్ గురించి ప్రస్తావించిన తర్వాత పోలీసులు మరింత రెచ్చిపోతున్నారని ఆరోపించారు. తనను రెడ్‌బుక్‌తో పాటు ఎన్ని పుస్తకాల ద్వారా ఇరికించేందుకు ప్రయత్నించినా తాను భయపడబోనని నారాయణస్వామి స్పష్టం చేశారు. తనపై అవినీతి ఆరోపణలు చేయలేమని గతంలో చంద్రబాబే చెప్పారని గుర్తు చేశారు. ఇక, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కూడా నారాయణస్వామి విమర్శలు గుప్పించారు. పవన్ సినిమా నటుడని, ఆయన ఎప్పుడు ఏమి మాట్లాడతారో ఆయనకే తెలియదని వ్యాఖ్యానించారు. ముందుగా కూటమి నాయకులపై ఉన్న క్రిమినల్ కేసులపై చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్‌ను కోరారు. మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కిలోకు రూ.4 మద్దతు ధర కూడా వైసీపీ చేపట్టిన పోరాటాల ఫలితమేనని నారాయణస్వామి అన్నారు.

## పల్ల శ్రీనివాసరావుతో రాధాగాయత్రి తల్లి భేటీ

### కూతరు మరణంపై వివరణ..న్యాయం కోసం అభ్యర్థన

### అండగా ఉంటామని టిడిపి అధ్యక్షుడి హామీ

విశాఖపట్నం:విశాఖకు చెందిన టెకీ రాధా గాయత్రి మృతి కేసులో న్యాయం కోసం కుటుంబసభ్యులు పోరాడుతున్నారు. సోమవారం ఉదయం టీడీపీ ఎమ్మెల్యే శ్రీనివాస్ రావును గాయత్రి తల్లి సత్యవతి కలిశారు. ఈ సందర్భంగా రాధా గాయత్రి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. తమకు న్యాయం చేయాలని, కూతురి మృతికి కారణమైన దోషులను శిక్షించాలని తల్లి, బంధువులు కోరారు. ఈ కేసు విషయంపై హోం మంత్రి వంగలపూడి అనితతో పల్లా శ్రీనివాస్ ఫోన్‌లో మాట్లాడారు. రాధా గాయత్రి హత్య కేసుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహాకారం అందిస్తామని పల్లా తెలిపారు. టెకీ గాయత్రి హత్య ముస్సోరిలో జరగటంతో కేసు తుది విచారణ హక్కు అక్కడి పోలీసులకే ఉంటుందన్నారు. రాధా గాయత్రి కుటుంబానికి అండగా ఉంటామని పల్లా శ్రీనివాస్ రావు హామీ ఇచ్చారు. భర్త శ్రీచరణ్‌తో కలిసి ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి వెళ్లిన గాయత్రి ఈనెల 14న అక్కడి హోమ్‌స్టేలో మృతిచెందిన విషయం తెలిసిందే. గాయత్రి ముక్కు నుంచి రక్తం వచ్చినట్లు గుర్తించిన ముస్సోరి పోలీసులు తొలుత అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. అయితే గాయత్రి తండ్రి ఫిర్యాదుతో భర్త శ్రీచరణ్‌పై అక్కడి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కుటుంబసభ్యులను ఏపీ తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసు గురించి విన్నప్పుడు చాలా బాధ కలిగిందన్నారు. శ్రీచరణ్ సింహాచలం పరిధిలో ఒక లాడ్జిలో దిగినట్లు బంధువులు చెబుతున్నారు. కేసు నమోదైన వెంటనే ఇక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. ఇప్పటికే ముస్సోరీలో కేసు నమోదు చేశారని పల్లా తెలిపారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/